www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 20 | జూలై | 2026
పేజీలు : 8

## మధిర సిగలో మరో మణిహారం

**-ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు జీవో విడుదల**



**ప్రజాపక్షం/ఖమ్మం :** అభివృద్ధి విషయంలో పరుగులు పెడుతూ అనేక చారిత్రక నిర్మాణాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు వేదికగా మారిన మధిర సిగలో మరో మణిహారం చేరనుంది. ఈ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్యలో మరింత పురోగమించేందుకు ఉపయోగపడే రీతిలో ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో ఏర్పాటు చేయనున్న రెండవ ఇంజనీరింగ్ కళాశాల ఇది. గత ప్రభుత్వం పాలేరు నియోజక వర్గం మద్దులపల్లిలో జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ఈనెల 18న రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి యోగితా రాణా జీవోను విడుదల చేశారు. మధిర ప్రాంతం ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యాపరంగా అగ్రగామిగా ఉండేది.

మిగతా 2లో..

## గిరిజన హక్కుల సాధన కోసం కదలండి





**- ఏజెన్సీ చట్టాల పటిష్టతకు సమష్టిగా ఉద్యమిద్దాం**
**- పోడు సాగుదారులపై దాడులు, నిర్భంధాలను ప్రతిఘటిద్దాం**
**అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇంచార్జ్, సిపిఐ జాతీయ కార్యదర్శి అనీరాజా**
**- భూములపై నిర్భందాలను అడ్డుకుంటాం : కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజన హక్కుల సాధనకు ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు గిరిజన లోకం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందని, అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇంచార్జ్ సిపిఐ జాతీయ కార్యదర్శి అనీరాజా పిలుపునిచ్చారు. స్థానిక లారీఓనర్స్ అసోసియేషన్ హాల్ అమరజీవి సోయం గంగులు నగర్ ఠానూనాయక్ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలు రెండో రోజు ప్రతినిధుల సభ అత్యంత ఉత్సాహంగా జరిగింది. ముందుగా టిజేఎస్ పతాకాన్ని గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం అనీరాజా మాట్లాడుతూ పాలకులు ప్రజావ్యతిరేక విధానాల వల్ల గిరిజన ప్రాంతాల్లో హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తరాలుగా అడవిని నమ్ముకుని బ్రతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. పోడుసాగు దారులకు పూర్తి రక్షణ కల్పించేంత వరకు, గిరిజన సంక్షేమం సిద్ధించే వరకు రాజీలేని పోరాటాలు

మిగతా 2లో..

## మల్లన్నా మధనుడి పెత్తనమెంది స్వామి

**-కైంకర్య సేవల్లో అభివృద్ధి కమిటీ జోక్యం**
**-ఉలుకు పలుకు లేని దేవాదాయ, ధర్మాదాయ శాఖ**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో గుంటుమల్లేశ్వర స్వామి పుణ్య క్షేత్రమొకటి. నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంత భక్తులకు గుంటుమల్లేశ్వర స్వామిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. సనాతన దేవాలయంగా పేరొందిన ఈ దేవాలయంపై అభివృద్ధి కమిటీ పేరుతో కొందరి పెత్తనం, ఆలయంలో జరిగే నిత్య పూజలకు, కైంకర్య సేవలకు అడ్డంకిగా మారింది. అత్యంత ప్రాశస్యం కలిగి స్వయంభూ శైవ క్షేత్రంగా వెలుగొందుతున్న ఈ ఆలయానికి సంబంధించి ఇటు భక్తులకు అటు స్వామి సేవలో ఉన్న పూజారులకు అభివృద్ధి కమిటీ పేరుతో ఆ మధనుడి అధికార దర్పం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఆలయ కమిటీ ఛైర్మన్ కోసం విశ్వ ప్రయత్నం చేసి విఫలమైన వ్యక్తి దొడ్డిదారిలో అభివృద్ధి కమిటీ పేరుతో ఒక పదవిని తెచ్చుకుని ఆలయంపై పెత్తనం చేస్తున్నాడన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిత్య పూజా క్రతువుల్లో ఈ మధనమోహనుడు జోక్యం చేసుకుంటూ ప్రతి దానికి వెనకా ముందు మంత్రి పేరు ఉపయోగిస్తున్నాడు. మంత్రికి చెప్పమంటారా తీసేయ మంటారా, మౌనంగా ఉంటారా అన్న మాటలు తప్ప ఈయన నోటి నుంచి మరో మాట వినపడటం లేదు.

మిగతా 2లో..

## పుష్కరాల నాటికి ఆలయాభివృద్ధి పనులు పూర్తి



**- నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలి**
**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పుష్కాలు ప్రారంభమయ్యే పదిరోజుల కంటే ముందే శ్రీసీతారామ చంద్రస్వామి వారి ఆలయాభివృద్ధి పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయాభివృద్ధి పనులను పరిశీలించేందుకు భద్రాచలం చేరుకున్న ఆయన ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.దర్శనం అనంతరం కలెక్టర్ అంకిత్, ఎంఎల్‌ఏలు డా. తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు ఎస్‌పి రోహిత్, ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, సర్పంచ్ పూనెం కృష్ణదొర దేవస్థానం ఇఓ దామోదర్ రావుతో కలిసి ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మ్యాప్‌ల ద్వారా మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆలయాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసిందని, ఆలయాభివృద్ధి విస్తరణ కోసం భూ సేకరణ చేసేందుకు సుమారు రూ.75కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ఈ పనరుద్ధరణ పనులు వందశాతం పూర్తి చేస్తామన్నారు. ఆలయ గోపురాలు, పురాతన వైభవానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా నిపుణుల పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయని చెప్పారు. పునరుద్ధరణ పనుల వల్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా గోదావరి తీరంలో స్నానఘట్టాలు, సౌకర్యాలు,

మిగతా 2లో..

## మెరుగైన వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

**-రూ 11.80కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం, రెండు బీటీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన**
**- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**



**ప్రజాపక్షం/కారేపల్లి/కామేపల్లి:** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం కామేపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి సుమారు రూ 11.80కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా అడవి మద్దులపల్లి గ్రామంలో రూ 2.85కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ ఉప కేంద్రం ద్వారా మండలంలోని పలు గ్రామాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. అనంతరం రూ 3.95కోట్ల వ్యయంతో తాళ్లగూడెం, నర్సయ్యకుంట(ఎంపీపీఎస్ పాఠశాల మీదుగా)నిర్మించనున్న బీటీ రహదారికి, అలాగే రూ 5కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కామేపల్లి స్మశానవాటిక వరకు పెద్దచెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యుత్, రహదారి వ్యవస్థ బలోపేతం కావడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, వ్యవసాయానికి అవసరమైన మద్దతు, గ్రామీణాభివృద్ధికి కొత్త ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీఎన్పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి, ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి మోహన్‌రావు, సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, పీఆర్ ఎస్ఈ జి వెంకట్‌రెడ్డి, ఈఈ మహేష్ బాబు, కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధన కోసం కదలండి





(మొదటిపేజీ తరువాయి)నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**ఐక్య ఉద్యమాలతోనే హక్కుల సాధన : కూనంనేని**

ఐక్య ఉద్యమాలతోనే గిరిజన హక్కుల రక్షణతో పాటు న్యాయం సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ పాలకుల అణచివేత వైఖరిని గిరిజన లోకం ఐఖ్యంగా ఎదుర్కొవాలన్నారు. గిరిజన భూములుపై ఎలాంటి నిర్భంధాలను పెట్టినా సహించేది లేదని, అడవిపై సర్వహక్కులు గిరిజనులవే అని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజాపక్షాన ఉంటూ బలమైన ఉద్యమాలను నిర్మించి గిరిజన బిడ్డలకు పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

**పోలవరం పేరుతో ఆదివాసీల జలసమాధి : సాబీర్ పాషా**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో సుమారు రెండు లక్షల మంది ఆదివాసీలను జలసమాధి చేస్తున్నారని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. తరాలుగా అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అమాయకులను అభివృద్ధి పేరుతో అడవి నుండి దూరం చేసే సహజ వనరులను కొల్లగొట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులకు అన్యాయం జరిగే ప్రతీ అంశంపై ప్రతిఘటిస్తామని తెలిపారు. గిరిజన నాయకులు సోయం గంగులు, ఠానూనాయక్ వారసత్వాన్ని పునికి పుచ్చుకుని గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ రెండు రోజుల పాటు సాగిన టిజిఎస్ రాష్ట్రమహాసభల్లో ప్రజానాట్యమండలి కళాకారుల ఆటా పాటా ఆకట్టుకున్నాయి. అంతరం టిజిఎస్ ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత కాలంగా గిరిజన హక్కుల కోస ం చేసిన ఉద్యమాలను, భవిష్యత్ కార్యచరణను నివేదికలో పొందుపరిచినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పోడుభూముల పట్టాల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పన, విద్యా వైద్య రంగాల బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, సిపిఐ టిజిఎస్ నాయకులు ముత్యాల విశ్వనాథం మేయర్ మూడ్ గణేష్ నరాటి ప్రసాద్ సలిగంటి శ్రీనివాస్ కంచర్ల జమలయ్య వి పూర్ణచంద్రరావు అడుసుమిల్లి సాయిబాబా భూక్యా ధశ్రు ఉప్పుశెట్టి రాహుల్ భూక్యా శ్రీనివాస్ సోందె కుటుంబ రావు వెంకట్ రాష్ట్ర జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## పుష్కరాల నాటికి ఆలయాభివృద్ధి పనులు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

మౌళిక వసతులు కల్పిస్తామని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. పునరుద్దరణ పనుల కోసం ఇంజనీరింగ్ శాఖ నుండి వెంటనే ప్రత్యేక అధికారిని నియమించాలని దేవాదాయశాఖ కమీషనర్ హనుమంతరావును ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రతీ పదిరోజులకు ఒక సారి క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. పనుల్లో ఎలాంటి ఆటంకాలు రాకుండా అదనంగా కార్మికులను పెట్టుకుని నిరంతరాయంగా పనులు చేయాలన్నారు. ఇసుక చట్టబద్ధంగా అందుబాటులో ఉన్న ప్రాంతాల నుండి సరఫరా అయ్యేలా అనుమతులు జారీ చేస్తామన్నారు. నిర్మాణపనులకు అన్ని విధాలుగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆర్కిటెక్ మూర్తి, ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మధిర సిగలో మరో మణిహారం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రాంతం నుంచి అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ శాఖల్లో అత్యున్నత బాధ్యతలను నిర్వర్తించారు. భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయలను మంజూరు చేయిస్తున్నారు. ముఖ్యంగా రవాణా రంగంలో రాష్ట్రంలోనే మధిర ప్రథమ స్థానంలో నిలవనుంది. వందల కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం జరుపుతూ ప్రతి పల్లెనూ అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే మధిర నియోజక వర్గంలో బిటి రోడ్డు లేని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. సౌర విద్యుత్ రంగంలోనూ మధిర నియోజక వర్గం ముందు వరుసలో నిలిచింది. గృహ అవసరాలతో పాటు వ్యవసాయ రంగానికి కూడా సౌర విద్యుత్‌ను ఉపయోగించుకునేందుకు మధిర నియోజక వర్గంలో సిరిపురం గ్రామాన్ని ఎంపిక చేసి సౌర విద్యుత్‌కు మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతున్నారు. బోనకల్ మండలం రావినూతలలో నూటికి నూరు శాతం సౌర విద్యుత్‌ను వినియోగించేలా పనులు జరుగుతున్నాయి. జవహర్ ఎత్తిపోతల పథకం పేరుతో ఒక పక్క పలు లిఫ్ట్ ఇరిగేషన్‌లు గోదావరి జలాల సద్వినియోగంతో నియోజక వర్గంలో సాగు నీటి కొరతను నివారించేందుకు ప్రయత్నం జరుగుతుంది. ఆసుపత్రుల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు తదితర వాటి ఏర్పాటుకు కృషి చేస్తున్న భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయడంతో ఈ ప్రాంతం విద్యాపరంగా మరోసారి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

## మల్లన్నా మధనుడి పెత్తనమెంది స్వామి

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేయాల్సిన అభివృద్ధి కమిటీ ఇతరత్రా విషయాల్లో జోక్యం చేసుకుని ఆలయ ప్రతిష్టకు కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈయనకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖలో అధికారులు నోరు విప్పే పరిస్థితి లేదు. ప్రభుత్వ నిర్ణయాలను సైతం అడ్డుకుంటూ అభివృద్ధి కమిటీ పేరుతో ఉన్న ఆయన తలను తోక ఆడించినట్లుగా మొత్తం దేవాలయ కార్యక్రమాలను తన కనుసన్నల్లో జరిగేందుకు సిద్ధం చేసుకుంటున్నాడు. ప్రతి దానికి మంత్రి పేరు ఉపయోగిస్తూ పూజారులను వారి నిత్య కార్యక్రమాలను కూడా చేయనిచ్చే పని లేదు. తాను ఒక అధికారిలా, ఛైర్మన్‌లా తెల్లకాగితాలపై హామీలు రాయించుకుంటూ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయమై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి పరోక్ష పెత్తనాన్ని అరికట్టాలని గుంటు మల్లేశ్వరునికి నిత్య పూజా నైవేద్య కార్యక్రమాలు యధాతథంగా జరిగేలా చూడడంతో పాటు ఆలయ కమిటీని కాదని అభివృద్ధి కమిటీ పేరుతో జరుగుతున్న ఈ తతంగాన్ని నిలువరించాలని భక్తులు కోరుతున్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తాం



**-మోరంపల్లిబంజరలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం**
**-రూ 2.20కోట్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన**
**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** పూరి గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర గ్రామంలో అవుల రమణ దంపతుల ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి, అనంతరం పినపాకపట్టినగర్, ఉప్పుసాక మార్గంలో రూ 2.20కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ బి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పినపాక నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు అందిస్తున్నామని, రాష్ట్రంలోని అర్హులైన అన్ని పేద కుటుంబాలకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రైతులకు రెండు పంటలకు రైతు భరోసా అందిస్తున్నామని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గానికి తొలి విడతలో 4,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుగా కాగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్ల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బూర్గంపాడు మండలానికి మంజూరైన 675 ఇళ్లలో 325 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే సీతారామ కాలువల ద్వారా దోమలవాడు చెరువుకు నీరు విడుదల చేసి రెండు పంటలు పండేలా చర్యలు తీసుకున్నామని, దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీవో జములారెడ్డి, హౌసింగ్ పీడీ శంకర్, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత

**-అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు**
**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పినపాక నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ బి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్‌తో కలిసి అశ్వాపురం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రధానంగా గొందిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో రూ 2.40కోట్లతో 16 అదనపు తరగతి గదులు, రూ 22కోట్లతో అశ్వాపురం, మొండికుంట బీటీ రహదారి, అమ్మగారిపల్లిలో రూ 20లక్షలతో గ్రామ పంచాయితీ భవనం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని, పినపాక నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇళ్లతో పాటు అదనంగా 1,000 ఇళ్లు, రెండో విడతలో 2,500 ఇళ్లతో పాటు మరో 2,000ఇళ్ల మంజూరును పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రూ 2లక్షల రైతు రుణమాఫీ, మహిళల సాధికారత కోసం వడ్డీలేని రుణాలు, ఏడాదిలో 72వేల ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేసిందన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రతి పాఠశాలకు ఐదు టీవీలు చొప్పున 60 పాఠశాలలకు అందజేస్తామని, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. అశ్వాపురం సెంట్రల్ డివైడర్, వీధి దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వారసత్వానికి తూట్లు..భూభారతికి వక్రభాష్యం..!



**-మామూళ్ల ఇస్తేనే పని..లేదంటే ఫైళ్లకు బ్రేక్?**
**-బోనకల్ రెవెన్యూ కార్యాలయంపై రైతులు తీవ్ర ఆరోపణలు**

**ప్రజాపక్షం/బోనకల్:** బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిపై తీవ్ర విమర్శలు చేస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి కూడా రైతులకు అంశించిన న్యాయం చేయడం లేదన్న విమర్శలు బోనకల్ మండలంలో బలంగా విన్పిస్తున్నాయి. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగమే కొత్త చట్టాన్ని అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని రైతులు మండిపడుతున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆళ్లపాడు గ్రామానికి చెందిన ఓ రైతు ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఆయన 8 ఎకరాల భూమిని మనవళ్ల పేరున వారసత్వంగా నమోదు చేసుకునేందుకు కుటుంబసభ్యులు భూభారతి పోర్టల్‌లో స్లాట్‌బుక్ చేసుకున్నారు. భూభారతిలో ఇందుకు స్పష్టమైన అవకాశం ఉన్నప్పటికీ తహసీల్దార్ తిరస్కరించి మరో సారి కొత్త విధానంలో దరఖాస్తు చేయాలని సూచించారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఆర్‌ఐ విచారణ పేరుతో ప్రక్రియను నిలిపివేయడంలో వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పని జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో 2 లక్షలు ఇస్తే పని పూర్తి అవుతుందని కార్యాలయంలో పనిచేసే ఆపరేటర్ ద్వారా భేరసారాలు జరిగాయని వారసులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. భూభారతి నిబంధనలను అధికారులు తమకు అనుకూలంగా అర్థం చేసుకొని రైతులను వేధిస్తున్నారని, మధ్యవర్తుల ద్వారా వచ్చేవారికి మాత్రమే పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గతంలో అవినీతి ఆరోపణలతో విధుల నుంచి తొలగించబడిన ఓ ప్రైవేట్ వ్యక్తి ఇప్పటికీ రెవెన్యూ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తూ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లలో మధ్యవర్తిత్వం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో అనధికార వ్యక్తుల పెత్తనం ఎందుకు కొనసాగుతుందని ప్రశ్నిస్తున్నారు. అంతే కాదూ..ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది ఆలస్యంగా వస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఉండాల్సిన వారు 3, 4 గంటలకే కార్యాలయం వీడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వచ్చిన వారిని ఆర్డీఓ కార్యాలయంలో ఉన్నాం.. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాం... అంటూ వెనక్కి పంపుతున్నారని వాపోతున్నారు. వాల్యూ సర్టిఫికెట్ల సహ ఇతర సేవలకు కూడా మామూళ్లు చెల్లించకపోతే పనులు జరగడం లేదని ఆళ్లపాడు, చిరునోముల గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో అవినీతి, ఆలస్యం, మధ్యవర్తుల వ్యవస్థపై ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా ముత్యాలమ్మకు ఆషాఢమాసం బోనాలు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఎర్రుపాలెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లికి ఆషాఢ బోనాలు వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. డప్పువాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, మంగళ వాయిద్యాల నడుమ బోనాల ఊరేగింపులతో ప్రభ బండ్లు కట్టుకుని గ్రామంలో కలియతిరిగారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ శ్రీ ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సర్పించారు. ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజల సహకారంతో బోనాల ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాలు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ సంస్కృతిక ప్రతీక అయిన ఆషాఢ మాసబోనాల వేడుకలు గుర్రాల చెరువు గ్రామంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆషాఢంలో అమ్మవారిని పూజిస్తే సుఖసంతోషాలు, వర్షాలు కురిసి పంటలు పండుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో గ్రామ దేవతకు ప్రముఖ నాయకురాలు కాసాని పద్మ బోనం ఎత్తుకుని గ్రామ వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆమె వెంట అశ్వారావుపేట మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ ప్రముఖ వైద్యురాలు డాక్టర్ భూక్యా ఉదయజ్యోతి కూడా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కృపతో గ్రామంలోని ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు ఉండాలని, రైతులకు మంచి వర్షాలు పడి పంటలు పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇలాంటి సాంప్రదాయాల ద్వారానే మన సంస్కృతి నిలబడుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తితో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. బోనాలు అనంతరం గ్రామంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దెత్తున స్థానికులు, మహిళా సంఘాల సభ్యులు, పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## వర్షం కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల గ్రామంలో రైతులు , గ్రామస్తులు, యువకులు ఆదివారం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని బోడ్రాయి, ముత్యాలమ్మ, మైసమ్మ చెట్టు వద్ద జలాభిషేకాలు చేసి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఆశించిన మేర వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వరుణుడి ప్రసన్నమై సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలను కాపాడాలని వేడుకున్నారు. గ్రామస్థులు మంచిగా వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా కురువాలని ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రారంభానికి సిద్ధమైన బాలికల వసతి గృహం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలికల వసతి గృహం ప్రారంభానికి సిద్ధమయింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు ప్రిన్సిపల్ వేముల శేఖర్ తెలిపారు. దీనితో కల్లూరు ప్రాంత ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు బట్టి ఎదురుచూస్తున్న కలలు నేటికీ నిజమైనట్లు మండల ప్రజలు తెలుపుతున్నారు. ఈ కళాశాల ఆవరణలో వసతి గృహం పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యను అభ్యసించుటకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ఈ కళాశాలలో సుమారుగా 200 మంది విద్యార్థినిలు చదువుకునేందుకు అనుకూలంగా ఉంటుందని ప్రిన్సిపాల్ వివరిస్తున్నారు. ఈ వసతి గృహంలో పేద, ఓసి ,ఎస్సి, ఎస్టి ,బిసి సామాజిక వర్గాలకు చెందిన వారికి సమీకృత వసతి గృహం ఎంతో ఉపయోగపడుతుందని బాలికల తల్లిదండ్రులు స్థానిక మంత్రులు కు ప్రభుత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలుపుతున్నారు .గత 30 సంవత్సరాల సంవత్సరాల కల నెరవేరిందని త్వరలో ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ముమ్మరంగా వరి నాట్లు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చెరువులు, కుంటలు, బోరు బావులు, నేలబావులు, ఆయుకట్టల పరిధిలో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా నడుస్తున్నాయి. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం,పెద్ద కోరుకొండి,చెన్నూరు, లింగాల, ఎర్రబోయిన పల్లి, వాచ్యనాయకతండా, బోడి మల్లె, ముచ్చవరం, పాయపూరు,పేరువంచ, బత్తులపల్లి, లక్ష్మీపురం, లోకవరం, పోచవరం, కొర్లగూడెం, ఎర్ర బంజర తదితర గ్రామాలలో నీటి వనరుల సముదాయముల పరిధిలో నాట్లు ముమ్మురంగా కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 13,000 ఎకరాలలో ఇప్పటివరకు పూర్తయి నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఈ సంవత్సరం ఎంతో ఆశతో ఎన్నో అనుమానాలతో ఈ ఖరీఫ్ వరి పంట సాగుకు సిద్ధమైనట్లు రైతులు పేర్కొంటున్నారు.

## కారేపల్లిలో భట్టికి ఘన స్వాగతం



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కారేపల్లి మండలంలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో ఆది వారం కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతిని ధులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కామేపల్లి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసుకుని కార్యక్రమాలకు వెళ్తున్న సందర్భంగా భట్టి విక్రమార్కకు నాయకులు శాలువా కప్పి, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమాల కారణంగా ఆలస్యమవుతోందని, మరోసారి సమావేశమవుదామని చెప్పి ఆయన అక్కని నుంచి బయలుదేరారు. ఉప ముఖ్యమంత్రి వెంట వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రామిరెడ్డి గోపాల్‌రెడ్డి ఉన్నారు. ఈకార్య క్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్, అడ్డగోడ ఐలయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసి పోడు రైతులపై దాడులను ఖండిస్తున్నాం




**ప్రజాపక్షం/కారేపల్లి:** అశ్వాపురం మండలం మణిబో తులగూడెంలో ఆదివాసి పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారులు దాడి చేయడాన్ని అఖిల భారత ఐక్య రైతు సంఘం, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సింగరేణి మండలం పోలంపల్లి గ్రామంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు గుగులోత్ తేజ నాయక్ మాట్లాడుతూ దాడిలో సోలం జ్యోతి, కల్తి సీతమ్మ, మడకం గంగమ్మ, మడకం జ్యోతి గాయపడ్డారని ఆరోపించారు. దాడికి బాధ్యులుగా పేర్కొన్న ఫారెస్ట అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, పోడు రైతు లపై బలవంతపు చర్యలు నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ కమిటీ సభ్యుడు పులకాని సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యుడు భూక్య నాగరాజు, రవి నాయక్, అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ సభ్యులు రావుల నాగేశ్వరరావు, హరిదాస్ నాయక్, రవీం దర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్మన్‌గా ఎంఎల్ఏ కోరం



**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ శాసన సభ, శాసన మండలి సంయుక్త లెజిస్లేచర్ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్మన్‌గా ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా ఎంఎల్ఏలు సునీత లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాలోతు రామదాసు నాయక్, మామిడాల యశస్విని రెడ్డి, పి రాకేష్ రెడ్డి తో పాటు ఎంఎల్‌సీలు సుంకరి రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వంటేరు యాదవరెడ్డిలను నియమించారు. ఈమేరకు శాసన మండలి కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు, శాసన సభ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి సంయుక్తంగా బులెటిన్ విడుదల చేశారు. కోరం కనకయ్య నియామకంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ముందస్తు అరెస్టులను ఖండించిన పీవైఎల్



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క ఇల్లందు, గుండాల, బీసీఎం, రొంపేడు పర్య టన సందర్భంగా న్యూడెమె క్రసీ నాయకులు భానోత్ ఊక్లా, ఇల్లందు సబ్ డివిజన్ కార్యదర్శి గుగులోతు రామచందర్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మం గన్న, కుల సంఘ నాయకులు రవి, నరేష్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్)తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్ ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులను అరెస్టు చేయడం కాకుండా సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమరారం, బోడు, టేకులపల్లి ప్రాంతాల్లో 100 పడకల ఆసుపత్రి, స్థానిక యువతకు ఉపాధి, అటవీ భూ సమస్యల పరిష్కారం, ఆరు గ్యారంటీల అమలు, రేషన్ దుకాణాల్లో 26 రకాల నిత్యావసర వస్తువుల సరఫరా వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ ముందుస్తు అరె స్టులను ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని భూక్య శివ నాయక్ పిలుపునిచ్చారు.

## గాంధీనగర్‌లో రామనామ ధర్మ ప్రచారం

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని గాంధీనగర్ గ్రామంలో అవధూతేంద్ర భక్తమండలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి భగవన్నామం, హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో హరేరామ నామసంకీర్తనతో నగర సంకీర్తన నిర్వహించి, అనంతరం స్థానిక దేవాలయంలో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ప్రవచకర్త నెహ్రూ సనాతన హిందూ ధర్మం విశిష్టతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. సామాజికవేత్త కడివంటి వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన, వాతావరణ సమతుల్యతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో భక్తమండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, నాగభూషణం, మనోజ్ కుమార్, రవి, కేశగాని నాగయ్య, సైదులు, అమ్మగారుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# లైసెన్స్ ఒకరిది..పెత్తనం మరొకరిది..!

**-ఖమ్మం జిల్లాలో తెరవెనుక షాడో డీలర్ల దందా..?**
**-సిండికేట్ సామ్రాజ్యంగా మారిన రేషన్ వ్యవస్థ**
**-పేదల బియ్యం బ్లాక్ మార్కెట్ బాట..!**
**-చిన్న చేపలే వలలో...**
**అసలు సూత్రధారులు మాత్రం అందని ద్రాక్షేనా..?**





**ప్రజాపక్షం/వైరా:** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఓట్ల రూపా యల సబ్సిడీతో అందిస్తున్న రేషన్ బియ్యం అసలైన లబ్దిదారుల చేతికి పూర్తిగా చేరుతుందా..? లేక మధ్యలోనే అక్రమ రవాణా మాఫియా చేతు ల్లోకి ఎళ్లి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముడవుతోందా...? అనే ప్రశ్నలు ఖమ్మం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఘటనలు వెలుగుచూస్తున్నప్పటికీ, వాటి వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోప ణల ప్రకారం, జిల్లాలో కొందరు ప్రభావశీలులు షాడో డీలర్లుగా వ్యవ హరిస్తూ తమ పేర్లపై లైసెన్స్ లేకపోయినా పలువురు లైసెన్స్ డీలర్ల ద్వా రా రేషన్ దుకాణాలను పరోక్షంగా నియంత్రిస్తున్నట్లు చెబుతున్నారు. ఒకరి పేరుపై లైసెన్స ఉండగా, నిర్వహణ, కొనుగోలు, విక్రయాలు, అక్రమ రవాణా వ్యవహారాలు మాత్రం మరొకరి చేతుల్లోనే జరుగుతుఆ న్నయనే విమర్శలు ఉన్నాయి. దీంతో చట్టపరమైన బాధ్యత లైసెన్స్ హోల్డర్‌పై పడుతుండగా, అసలు దందా నడిపించే వారు మాత్రం బయ టపడకుండా తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి షాడో డీలర్లు జిల్లాలో పలుచోట్ల సిండికేట్లుగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని భారీ ఎత్తున సేకరించి, ఇతర రాష్ట్రాలకు లేదా ప్రైవేటు రైస్ మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పేదల కు ఉద్దేశించిన బియ్యం బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం ద్వారా భఋరీగా అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారనే విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. ఇక అధికారులు నిర్వహిస్తున్న దాడులు కూడా ప్రశ్నార్థ కంగా మారాయని ప్రజలు అంటున్నారు. అక్రమ రవాణా పట్టుబడిన ప్రతిసారి లారీ డ్రైవర్లు, చిన్న స్థాయి మధ్యవర్తులు లేదా కూలీలపైనే కేసులు నమోదు అవుతున్నాయని, కాని ఈ వ్యవహారం వెనుక ఉన్న ఆర్థిక బలం, రాజకీయ అండ, సిండికేట్ నెట్‌వర్క్‌పై లోతైన దర్యాప్తు జరగడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో అసలు సూత్రధారులు ప్రతి సారి చట్టం నుంచి తప్పించుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుం ది. ప్రతి రేషన్ దుకాణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, ఈ పా యింట్ ఆఫ్ సేల్(ఈపీవోఎస్) లావాదేవీలను నిరంతరం పర్యవేక్షించ డం, స్టాక్ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, అక్రమ రవా ణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రేషన్ వ్యవస్థలో షాడో డీలర్ల పాత్రపై సమగ్ర విచారణ జరిపి వారి వెనుక ఉన్న సిండికేట్లు, సహకరిస్తున్న అధికారులు లేదా ఇతరుల పాత్ర ఉంటే వెలికితీసి కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు రాయడం తగదు

**- ఊహాజనిత వార్తలను ఖండిస్తున్నాం**
**- సిపిఐ ప్రజాప్రతినిధులపై**
**అసత్య ప్రచారాలు మానుకోవాలి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజాప్రతినిధుల వ్యక్తిత్వాన్నిదెబ్బతీసేలా వార్తలు రాయడం జర్నలిజం విలువలకు విరుద్ధమని సిపిఐ ప్రజాప్రతి నిధులపై బురదచల్లే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఐ కొత్త గూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికల్లో ఆధారాలు లేని ఊహాజనిత తప్పుడు వార్తలను ప్రచురించడం సరికాద న్నారు. సిపిఐ ప్రజాప్రతినిధులపై ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం వెనుక ఎవరి హస్తం ఉందో తెల్చుకుంటామని ఆయన అన్నారు.

**మర్యాదపూర్వక భేటీని వక్రీకరించడం సరికాదు : కార్పొరేటర్**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్ పడాల ఆకాంక్ష మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వెళ్లిన క్రమంలో తమ సామాజికవర్గానికి చెందిన రాష్ట్రనేత, ఎంపి ఈటెల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా మాత్రమే కలిశామని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఓ వ్యక్తి వాట్సాప్ స్టేటస్ ఫొటో ఆధారంగా సిపిఐ నుండి బిజేపిలో చేరుతున్నట్లు ఓ పత్రికా వక్రీకరిస్తూ ప్రచురించిందని మండిపడ్డారు. ఇలాంటి ఊహాజనిత కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆకాంక్ష హెచ్చరించారు. ఒక పార్టీ ప్రజాతినిధులు మరో మార్టీకి చెందిన ప్రజాప్రతినిధిని కలుసుకోవద్దు అనే ఆంక్షలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలను ఆ పత్రికా యాజమాన్యం వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, నేరెళ్ల రమేష్ పడవాల భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సమితి సింగారం అభివృద్ధికి భారీ ఊతం

**రూ.3.50 కోట్ల**
**అభివృద్ధి పనులకు భూమి పూజ**



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్ట మల్లారం నుండి కట్టు మల్లారం వరకు రూ.1 కోటి అంచనా వ్యయంతో నిర్మించబోయే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, అలాగే సాయి నగర్ నుండి లంక మల్లారం వరకు రూ.2 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొని శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.3 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వర్షాకా లంలో ప్రజల రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగి, గ్రామాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం కానుందని నాయకులు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ), డీసీసీ జిల్లా అధ్య క్షురాలు, సంబంధిత శాఖల అధికారులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, ప్రజాప్రతిని ధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బడి బస్సులు భద్రమేనా..?

**-స్కూల్ బస్సులపై పర్యవేక్షణ కరువు**
**-బస్సులో ఫిట్నెస్ ప్రమాణాపై అనుమానాలు**
**-బస్సులపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**
**-నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల బస్సుకు అనుమతులు**
**-పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలింపు**



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ :** ప్రతి ఏడాది స్కూల్ బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించి రహదారుల పైకి అనుమతించాల్సి ఉం టుంది. పాఠశాలలు ప్రారంభానికి ముందే రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలవుతున్నట్లు కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని అనేక బస్సులు తనిఖీలు లేకుం డానే రోడ్లపై తిరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. కార్పొరేట్ విద్యపై పెరుగుతున్న ఆకర్షణ, పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆశలు పలు ప్రైవేటు విద్యాసంస్థలకు వరంగా మారాయి. నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, సురక్షిత రవాణా పేరుతో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల రవాణా విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమ ర్శళు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నడుస్తున్న వందలాది స్కూల్ బస్సుల భద్రతపై రకరకాల ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో సుమారు 300కు పైగా ప్రైవేటు పాఠశాలలు కొనసాగు తున్నాయి. ఈ పాఠశాలలకు విద్యార్థుల కోసం 700 వరకు స్కూల్ బస్సులు రవాణాలో వినియోగంలో ఉన్నట్లు అంచనా వినిపిస్తుంది. అయితే ఈ పాఠశాలల బస్సుల్లో ఎన్ని వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఎన్ని వాహనాలు భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాయన్నది స్పష్టత లేదు.

### పరిమితికి మించి విద్యార్థుల తరలింపు...

కొన్ని ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు బస్సుల్లో పరిమితికి మించి ఇష్టా నుసారంగా విద్యార్థులను ఎక్కించడం, సీట్లలో కూర్చునే విధంగా వీలు లేకపోవడంతో నిలబడి పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్న బస్సులపై అధికా రులు తనిఖీ శూన్యం. రోజురోజుకు ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యా ర్థుల సంఖ్య పెరుగతుండటంతో కొన్ని విద్యా సంస్థలు సామర్థ్యానికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్నట్లు తెలుస్తుంది. విద్యార్థుల భద్రత కోసం తప్పనిసరిగా ఉండాల్సిన ప్రధమ చికిత్స కిట్లు, అగ్నిమా పక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మారాలు, జిపిఎస్ వ్యవస్థలు, సిసి కెమెరాలు అనేక వాహనాల్లో కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### బస్సులు లెక్క తేలాల్సి ఉంది...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్ని స్కూల్ బస్సులు నడుస్తున్నాయి. వాటిలో ఎన్ని ఫిట్నెస్ కలిగి ఉన్నాయి. ఎన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తు న్నాయి అనే అంశాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ వెంటనే నిలిపివేసి నిబం ధనలు పాటించని పాఠశాలలపై వహించాల్సిన అవసరం ఉంది. ఫిట్నెస్ లేని వాహనాలను చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తు న్నారు. విద్యార్థుళ భద్రత విషయంలోరాజీ లేకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### బస్సుల తనిఖీలపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

స్కూల్ బస్సులపై నిరంతర పర్యవేక్షణ బాధ్యత రవాణా శాఖపై ఉన్నప్ప టికీ క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు చేసినట్లు పూర్తిస్థాయిలో కని పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి స్కూల్ కాలేజ్ బస్సు లకు రోడ్ ట్యాక్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ డ్రైవర్ల అర్హతలు, సహాయ సిబ్బంది నియామకం వంటి అంశాలను పరిశీలించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు ఆశించిన స్థాయిలో లేవని తల్లిలండ్రులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో కొన్ని స్కూల్ బస్సులు మధ్యలో నిలిచిపోవడం, సాంకేతిక లోపాలు తలెత్తడం, స్వల్ప ప్రమా దాలు చోటు చేసుకోవడం వంటి ఘటనలు నమోదయ్యాయి. అయినప్ప టికీ పాఠశాల యాజమాన్యాలు, అధికారులు తగిన పాఠాలు నేర్చుకోలే దనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### మీ పిల్లలు వెళ్లే బడి బస్సు భద్రమేనా..?



విద్యార్థుల భద్రత కోసం బడి బస్సులో ఉండాల్సిన సౌకర్యాలు
అగ్నిమాపక పరికరం, అర్హత కలిగిన డ్రైవర్, చెల్లుబాటు అయ్యే లైసెన్స్
విద్యార్థుల పర్యవేక్షణకు అటెండర్
హెల్పర్, ఫస్ట్ ఎయిడ్ కిట్
అత్యవసర నిష్క్రమణ ద్వారం
జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థ
సిసి కెమెరాలు
స్పీడ్ గవర్నర్
నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు
భారీ జరిమానాలు
ఫిట్నెస్ లేని బస్సులు సీజ్
రిజిస్ట్రేషన్ రద్దుకు అవకాశం
పాఠశాల యాజమాన్యంపై చర్యలు
బస్సు ప్రమాదాలు జరిగిన పాఠశాలలపై క్రిమినల్ కేసు

అధికారులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే బస్సులపై నిఘా పెడితేనే ప్రమాదాలను ముందుగా అరికట్టవచ్చునని పలువురు తెలుపు తున్నారు.

## బూటకపు మెడికల్ బోర్డును రద్దు చేసి
# రీమెడికల్ బోర్డు నిర్వహించాలి

**- కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు**
**- యాజమాన్యంపై మిరియాల రంగయ్య ఆగ్రహం**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన సింగ రేణి మెడికల్ బోర్డు ప్రక్రియ పూర్తిగా బూటకమని, దానిని వెంటనే రద్దు చేసి గతంలో అమలు చేసిన విధానంలోనే రీమెడికల్ బోర్డు నిర్వహించా లని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసు ఫలితంగానే యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వ హించేందుకు ముందుకొచ్చిందని, అయితే 17, 18 తేదీల్లో జరిగిన బోర్డు పారదర్శకంగా జరగలేదని ఆరోపించారు. ఎంక్వైరీ పేరుతో దళా రీల జోక్యాన్ని పెంచి కార్మికులు, వారి కుటుంబాలను మోసం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అనారోగ్యంతో బాధపడు తున్న కార్మికులను ఇన్వాలిడేషన్ చేయకుండా వారి కుటుంబాల భవి ష్యత్తుతో యాజమాన్యం చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు జాబితాలో పేర్లు ఉన్న పలువురు కార్మికులకు కూడా కనీస సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. మంచానికే పరిమితమైన వారు, అవయవాలు కోల్పోయిన వారు, గుండెకు స్టెంట్లు వేసుకున్నవారు, కిడ్నీ సమస్యలతో యూరిన్ బ్యాగ్ ఉపయోగిస్తున్న కార్మికులను సైతం మెడికల్ బోర్డు పేరుతో ఇబ్బందులకు గురిచేయడం అమానవీయమని పేర్కొన్నారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యులకు కార్మికుల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా తెలిసి ఉంటుందని, గతంలో ముఖ్య వైద్యాధికారి పరిధిలోనే ఇన్వాలి డేషన్ చేసిన సందర్భాలు ఉన్నా యని గుర్తు చేశారు. ప్రస్తుత బోర్డును వెంటనే రద్దు చేసి, గతంలో అమలు చేసిన విధానం లోనే మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన అనారోగ్య కార్మికులను ఇన్వాలిడేషన్ చేసి, వారి వారసు లకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ బోర్డుకు ఉన్న రెండేళ్ల కాలపరిమితి నిబంధనను తొల గించి, సిక్‌లో ఉన్న కార్మికుడు దరఖాస్తు చేసిన వెంటనే ఇన్వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుతం సుమారు 2000 మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్నారని, వారి కోసం నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని సూచించారు. ప్రభు త్వాన్ని ఒప్పించామని చెప్పుకుంటున్న ఐఎన్‌టియుసి కార్మికులకు సమాధానం చెప్పాలని మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేరుతో యాజమాన్యం కాలయాపన చేయకుండా వెంటనే కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే సింగరేణి వ్యాప్తంగా ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిం చారు.

## ఆదివాసీ మహిళలపై దాడులు ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** అశ్వాపురం మండలం మణిబోతులగూడెంలో పోడు సాగుదారులైన ఆదివాసీ మహిళలపై ఫారెస్ట్ సిబ్బంది దాడులకు పాల్పడ్డారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆళ్లపల్లి మండల కార్యదర్శి బట్టు సురేష్ ఆరోపించారు. మహిళలని కూడా చూడకుండా భయభ్రాంతులకు గురి చేస్తూ పోడు భూములను ఆక్రమించుకోవడం దారుణమని ఆయన ఖండించారు. ఫారెస్ట్ సిబ్బంది దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని పేర్కొంటూ, మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు మెస్సు గోపాల్, గోగ్గెల గాదెరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు : తాటి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** కాంగ్రెస్ ప్రభు త్వం హామీలు ఇచ్చి అమలు చేయకుండా అబద్దాలతో కాలం గడుపుతోందని అశ్వారా వుపేట మాజీ ఎంఎల్ఏ, మాజీ ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం తుంగారం గ్రామంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాలువల ద్వారా భద్రాద్రి జిల్లా రైతులకు రావాల్సిన నీటిని ఖమ్మం జిల్లాకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. వర్షాభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాత డిజైన్ ప్రకారం ఐదు మండలా లకు కాలువలు పూర్తి చేసి సాగునీరు అందించాలని, ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచిస్తే వాటి విత్తనాలను రైతులకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతు లతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు వగ్గల పూజిత, తుంగారం సర్పంచ్ ప్రవీణ్ ప్రకాష్, సొసైటీ వైస్ ఛైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, నాయకులు సత్తి నాగేశ్వరరావు, కృపాకర్, సూరా వెంకటేశ్వర్లు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** సమృద్ధిగా వర్షాలు కురవా లని చంద్రుగొండ మండలంలోని తుంగారం, రేపల్లెవాడ గ్రామాల్లో ఆదివారం రైతులు, గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుంగారం గ్రామంలో కప్పలకు ప్రతీకాత్మకంగా పెళ్లి చేసి, రోకలి బండకు కట్టి గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ప్రతి ఇంటి ముందు మహిళలు కప్పలపై నీళ్లు పోసి, పసుపు, కుంకుమతో పూజలు నిర్వహిస్తూ మంచి వర్షాలు కురవాలని ప్రార్థించారు. అదే విధంగా రేపల్లెవాడ గ్రామంలో గ్రామదేవత గంగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ వీధుల్లో ఊరేగింపుతో మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు పంటలు సమృద్ధిగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** గిరిజన ఆశ్రమ పాఠ శాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యత అని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ మనీషా మదన్ లాల్ అన్నారు. ఆదివారం ఏన్కూరు మండలం మూలపోచారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల హాస్టల్‌ను ఆమె సంద ర్శించి, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఫ్యాన్లు, బల్లాలు సరిపడా లేక పోవడంతో చదువు, విశ్రాంతికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్ సమస్యలను సంబంధిత అధి కారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో మల్లెంపాటి మాధవరావు, అజ్మీర రైలు, నరసింహారావు, బుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు అండగా మిషన్ వాక్ ఫౌండేషన్



**ప్రజాపక్షం/ఏన్కూరు:** పేద ప్రజలు, వికలాం గుల సంక్షేమానికి మిషన్ వాక్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సంస్థ వ్యవ స్థాపకుడు డాక్టర్ బాదావత్ రవి తెలిపారు. మండల పరిధిలోని రాంనగర్ తండా గ్రామా నికి చెందిన వికలాంగులు ధరావత్ అశోక్, లక్ష్మణ్‌లను ఆదివారం ఆయన పరామర్శిం చారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, నడవలేని స్థితిలో ఉన్న ఇద్దరికీ త్వరలో బ్యాటరీ సైకిళ్లు అందజేస్తామని మామీ ఇచ్చారు. పాఠశాలకు అవసరమైన సీలింగ్ ఫ్యాన్లను అందజేస్తానని ఈసందర్భంగా హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తూతకలింగన్న పేట సర్పంచ్ గుగులోత్ ప్రవీన్, ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ డీఎస్ నాగేశ్వరరావు, చందు తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌సింగ్ మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/సుజాతనగర్‌:** సిపిఐ సీనియర్ నాయకులు, సుజాతనగర్ రైతు సంఘం మండల అధ్యక్షులు, అమరజీవి భూక్య మదన్ సింగ్ మరణించడం సిపిఐ పార్టీకి తీరని లోటు అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సుజాతనగర్ మండలంలోని సీతంపేట బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి భూక్య మదన్ సింగ్ స్థూపాన్ని ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు భాగం శేషభూషణం ఆవిష్కరించారు. ఈ సంతాప సభ భూక్య ప్రతాప్ సింగ్ అధ్యక్షతనజరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భూక్య మదన్ సింగ్ తన తుది శ్వాస వరకు పార్టీకి ఎనలేని కృషి చేశారని, రైతు సంఘం అధ్యక్షులుగా ఎంతో సేవ చేశారని వారి కుటుంబం మూడు తరాల నుండి పార్టీకి చేసిన సేవలు గురించి గుర్తు చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబానికి సిపిఐ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా మాట్లాడుతూ భూక్య మదన్ సింగ్ పార్టీకి ఎనలేని సేవలను అందించారని, నిరంతరం పార్టీ బలోపేతానికి కృషి చేశారని తన తుది శ్వాస వరకు పార్టీకి అంకితమయ్యారని, ఈ ప్రాంతంలో రైతుల సమస్యల కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ మండల కార్యదర్శి కోమారి వీర హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, తాళ్ల వెంకటేశ్వరరావు, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, లావుడియా గోపి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సుజాతనగర్ టౌన్ కార్యదర్శి బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గాప్రసాద్, లింగేష్, గడ్డం రాజేందర్, మాజీ ఎంపిటీసీ సభ్యులు ముక్కెర మురళి, సీతంపేట బంజర సర్పంచ్ జానకిరామ్, మాజీ సర్పంచ్ గుగులోత్ నెహ్రూ, లావుడియా హిరాలాల్, సీతంపేట సర్పంచ్ గరిక ఉపేందర్, గౌతంపూర్ సర్పంచ్, సింగభూపాలెం ఉపసర్పంచ్ గోరంట్ల ధర్మ, భాగం శ్రీకాంత్, శశికాంత్, కొండపల్లి నరేష్, సిపిఐ మండల నాయకులు కుణుసోత్ శంకర్, బోడ రమేష్ , మాలోత్ శంకర్, కుమారి కృష్ణ, సిపిఐ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని

# ర్యాలీకి సిసిఏ సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కాక్రోచ్ పార్టీ సోమవారం తలపెట్టిన జంతర్ మంతర్ ర్యాలీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఖమ్మం ప్రత్యామ్నాయ పౌర సమాజం (సిసిఏ) తెలిపింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడాన్ని సిసిఏ తీవ్రంగా ఖండించింది. దేశంలో లక్షలాది మందితో చెలగాటమాడిన నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం స్పందించకపోవడం యువత పట్ల అమర్యాదగా వ్యవహరించడం సరి కాదన్నారు. పర్యావరణ ఉద్యమకారుడు, గొప్ప విద్యావేత్త వాంగ్‌చుక్ దీక్ష పట్ల కేంద్రం అనుసరించిన వైఖరి సమర్థనీయం కాదన్నారు. ఇటు కాంగ్రెస్ కానీ, అటు బిజెపి కానీ నిరాహార దీక్షకు మద్దతు తెలియజేయకపోవడం సరి కాదని కేంద్ర నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన పార్టీలు మౌనం వహించడాన్ని సిసిఏ తీవ్రంగా ఖండించింది. నిన్న మొన్నటి వరకు అన్నదాతలను విచ్ఛిన్నకారులు అన్న కేంద్రం ఇప్పుడు యువతరాన్ని, విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తుందన్నారు. ప్రజలు హక్కుల కోసం పోరాడాలని పోరాడితేనే హక్కులు పరిరక్షించబడతాయని సిసిఏ కమిటీ తెలిపింది. ప్రకటన విడుదల చేసిన వారిలో సిసిఏ బాధ్యులు రవి మారుత్, కాకి భాస్కర్, డాక్టర్ గోపినాథ్, చిర్రా రవి, డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

# పంచాయతీ కార్మికుల మూడవ రాష్ట్ర మహాసభ సన్నాహక సమావేశం




**ప్రజాపక్షం/కల్లూరుః** ఈనెల 26న గణేష్ గార్డెన్ కళ్యాణమండపం రఘునాథపాలెం ఖమ్మం నందు జరిగే ఏఐటీయూసీ గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మిక సంఘం మూడవ రాష్ట్ర మహాసభ సన్నాహక సమావేశం కల్లూరు మండలం లింగాలలో సత్తుపల్లి డివిజన్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు మాగంటి రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ జరుగు మూడో రాష్ట్ర మహాసభలో జయప్రదం చేయాలని ఈ మహాసభలలో గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కొరకు తీర్మానాలు చేయాలని ప్రభుత్వం దృష్టికి ముఖ్యమంత్రి దృష్టికి కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే ద్వారా తీసుకెళ్లి సమస్యల పరిష్కరించే విధంగా కృషి చేయుటకు మహాసభ ఉపయోగపడుతుందని ఇట్టి మహాసభను జయప్రదం చేయాలని ఈ సమావేశంలో కార్మికులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, వైరా మండల నాయకులు కంభంపాటి మహేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రాజశేఖర్ తోపాటు మండల కార్యదర్శి జానపాటి మల్లేష్ ,మండల నాయకులు మట్టూరు శేషగిరిరావు, చామర్తి వెంకటేశ్వర్లు ,దేవరపల్లి నరసింహారావు, బానోత్ రమేష్ తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# మణుగూరు ఘటనపై నిష్పక్షపాత విచారణకు అటవీ శాఖ ఆదేశాలు

## అధికారి సస్పెన్షన్

**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు డివిజన్‌లో ఈ నెల 17న మొక్కల పెంపకం మరియు అటవీ భూమి పరిరక్షణ పనుల సందర్భంగా జరిగిన ఘటనను, అలాగే మీడియా మరియు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న వీడియోలను అటవీ శాఖ తీవ్రంగా పరిగణించింది. ప్రతి పౌరుని, ముఖ్యంగా మహిళల గౌరవం మరియు భద్రతకు అటవీ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. అదే సమయంలో, వీడియోలో కనిపించే ఘటనకు ముందు జరిగిన పరిణామాలు, ప్రభుత్వ పనులకు కలిగిన ఆటంకం, యూనిఫాంలో ఉన్న అటవీ సిబ్బందిపై జరిగినట్లు చెబుతున్న దాడి సహా మొత్తం సంఘటనల క్రమాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పారదర్శకత మరియు బాధ్యతను నిర్ధారించేందుకు వెంటనే ఈ క్రింది చర్యలు తీసుకోబడ్డాయి. వీడియోలో మహిళతో జరిగిన తోపులాటలో కనిపించిన ఫారెస్ట్ బీట్ అధికారిని విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్‌లో ఉంచడం జరిగింది. సస్పెన్షన్ అనేది తాత్కాలిక పరిపాలనా చర్య మాత్రమే. దోషిగా నిర్ధారించినట్లు భావించరాదు. కిన్నెరసాని ఫారెస్ట్ డివిజనల్ అధికారి అధ్యక్షతన, చంద్రుగొండ మరియు యానంబైల్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు సభ్యులుగా ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేయబడింది. సంబంధిత పర్యవేక్షణ మరియు క్షేత్రస్థాయి అధికారుల నుంచి వివరణలు కోరబడ్డాయి. అసలు వీడియోలు, ఫోటోలు, వైద్య నివేదికలు మరియు అధికారిక రికార్డులను భద్రపరిచి విచారణ కమిటీకి అందజేయడం జరుగుతోంది. పోలీసు శాఖ మరియు ఇతర సంబంధిత అధికారులకు అటవీ శాఖ పూర్తి సహకారం అందిస్తుంది. విచారణ కమిటీ మొత్తం ఘటనను పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా వ్యక్తిగత బాధ్యతను నిర్ధారిస్తుంది. దుర్వ్యవహారం, నిర్లక్ష్యం లేదా అవసరానికి మించిన బలప్రయోగం జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఈ ఘటనను ఏ రెండు వర్గాల మధ్య లేదా సమాజాల మధ్య వివాదంగా చూడరాదని అటవీ శాఖ స్పష్టం చేస్తోంది. అత్యంత విలువైన ప్రభుత్వ అటవీ భూమిని రక్షించడం మరియు మంజూరైన మొక్కల పెంపకం పనులను అమలు చేయడం శాఖ యొక్క చట్టబద్ధమైన బాధ్యత. దూర ప్రాంతాల్లో, క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది సేవలను శాఖ గౌరవిస్తుంది. నిజాయితీగా, చట్టబద్ధంగా మరియు సంయమనంతో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి శాఖ పూర్తి సంస్థాగత మద్దతు కొనసాగుతుంది. భవిష్యత్తులో ఇలాంటి సున్నితమైన క్షేత్రస్థాయి కార్యక్రమాలు తగిన ముందస్తు ప్రణాళిక, పోలీసు సమన్వయం, మహిళా సిబ్బంది నియామకం మరియు నిరంతర అధికారిక వీడియో రికార్డింగ్‌తో మాత్రమే నిర్వహించబడతాయి. పూర్తి వాస్తవాలను నిష్పక్షపాత విచారణ ద్వారా వెలికితీయడానికి ప్రజలు మరియు మీడియా సహకరించాలని, అసంపూర్ణమైన లేదా ఎంపిక చేసి ప్రసారం చేసిన వీడియోల ఆధారంగా ముందస్తు నిర్ణయాలకు రావద్దని అటవీ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ప్రభుత్వ అటవీ భూముల పరిరక్షణతో పాటు ప్రజల గౌరవం, భద్రత, పారదర్శకత మరియు న్యాయబద్ధతను కాపాడేందుకు అటవీ శాఖ కట్టుబడి ఉంది.

# వృద్ధురాలికి నివాళి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న దారుణ హత్య ఉదాంతంపై స్థానిక శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నగల కోసం వృద్ధురాలైన సుగుణమ్మను దొంగలు అత్యంత ఘోరంగా గొంతుకోసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పిండిప్రోలు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామంలో స్థానిక ప్రజలు, నాయకులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ ఈ ఘటన తీవ్రతను పరిగణలోకి తీసుకుని ఖమ్మం జిల్లా పోలీస్ కమీషనర్‌కి అధికారకంగా లేఖ రాసినట్లు తెలిపారు. పిండిప్రోలు తన సొంత గ్రామమైనందున ఈ దారుణ ఘటనతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని సిపిని కోరారు. నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సుగణమ్మ హత్య కేసులో పోలీసుల పురోగతి సాధిస్తారా..!

**- హత్య వెనుక ఒక్కరేనా..**

**గత దొంగతనాలతోనూ సంబంధాలపై ఆరా**

**- సుగణమ్మ హత్య కేసులో అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పిండిప్రోలు గ్రామంలో వృద్ధురాలు చెన్న సుగణమ్మ హత్య కేసు తిరుమలాయపాలెం మండలంలో తీవ్ర సంచలనంగా మారింది. ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. హత్యకు పాల్పడింది ఒక్క వ్యక్తేనా లేక మరెవరైనా సహకరించారా అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. అత్యంత కిరాతకంగా సుగణమ్మ నుదుటిపై బలంగా కత్తితో బలంగా కొట్టినట్లు పోస్టుమార్టం చేసిన వైద్యులు తెలిపినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు రెండుగంటల సమయంలో హంతకుడు ఇంట్లోకి ప్రవేశించి సుగణమ్మను చిత్రహింసలకు గురి చేసి బలంగా కొట్టడంతో రక్తపు మడుగులో ఆమె కొట్టుమిట్టాడుతుండగా నిందితుడు ఆధారాలు తీసుకువెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు. హంతకుడి ఆధారాలు దొరక్కుండా ఆ ప్రదేశంలో కారం చల్లినట్లు పోలీసులు నిర్ధారించారు. బంగారు ఆభరణాలను తీసుకువెళ్లే క్రమంలో హంతకుడితో ఆమె వాదించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో పక్కనే పక్షవాతంతో ఉన్న భర్త జనార్ధన్ ఉండగా ఇదంతా ఆయన ఎదుట జరిగినట్లు సైగల ద్వారా చెప్తున్నాడు. హంతకుడు పిండిప్రోలు గ్రామానికి చెందిన వ్యక్తి లేక మరి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తి అయ్యుంటాడా హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుడు గ్రామంలో వచ్చిన మార్గాలు, ఘటన అనంతరం వెళ్లిన దిశ, సిసిటివి దృశ్యాలు, సాంకేతిక ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. అలాగే గతంలో పిండిప్రోలు గ్రామంలో చోటుచేసుకున్న దొంగతనాల ఘటనలకు ఈ నిందితుడిని ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. పాత కేసుల వివరాలను ప్రస్తుత దర్యాప్తుతో పోల్చి పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ హత్య కేసును పోలీసులు త్వరలోనే పూర్తిగా ఛేదిస్తారా నిందితుడు ఒక్కడేనా లేక మరెవరైనా ఉన్నారా అనే ప్రశ్నలకు దర్యాప్తు పూర్తయ్యాకే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కేసు పురుగోతిపై గ్రామ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా నిందితుడిన్ని చట్టం ముందు నిలబెట్టి పూర్తి నిజాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



# మధిరలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులకు ఆహ్వానం



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీః** మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్స్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, గణితం, సబ్జెక్టుల్లో అతిది అధ్యాపకుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి తెలిపారు. అభ్యర్థులు సంబంధిత ధృవీకరణ పత్రాలతో ఈ నెల20వ తారీఖు సోమవారం నుండి 22వ తారీఖు బుధవారం సాయంత్రం 4గంటలలోపు తమ దరఖాస్తులు కళాశాలలో అందజేయాలని వివరించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పిజిలో 50%, ఇతర అభ్యర్థులకు పిజిలో 55% మార్కులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. పిహెచ్‌డి, నెట్, నెట్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, బోధన అనుభవానికి వెయిటేజ్ ఇస్తామని వివరించారు. ఈ నెల24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9440257256, 9441786508, 9553359879ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# భూ రీ సర్వే వేగవంతం చేయాలి



**-అటవీ, రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
**-శ్రీనివాసగుట్ట అభివృద్ధికి ఆదేశాలు**
**-మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూముల రీ సర్వే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, అటవీ, రెవెన్యూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రీ సర్వే పనుల్లో జాప్యం, నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టగా ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని, ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని అధికారులు వివరించారు. పాల్వంచలో రీ సర్వే పనుల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, అవసరమైన సర్వేయర్లు, సాంకేతిక వనరులు సమకూర్చి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కొత్తగా పోడు సాగు జరగకుండా చర్యలు తీసుకోవాలని, పాత పోడు సమస్యలను ప్రభుత్వ విధానాల మేరకు పరిష్కరించాలని సూచించారు. పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ఆలయానికి రహదారి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, ఎంఎల్‌ఏలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డీఆర్వో పద్మావతితో పాటు రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెరిగిన నిరుద్యోగం దేశానికి ప్రమాదం



**-ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలకులు విఫలం**
**-ఏఐవైఎఫ్ మండల మహాసభలో జమ్ముల**

**ప్రజాపక్షం/చింతకాని :** పెరిగిన నిరుద్యోగం దేశానికి పెను సవాల్‌గా మారిందని ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగిస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహాసభ స్థానిక గంగవరపు విజయ్‌కుమార్ భవన్‌లో జరిగింది. అబ్బూరి మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచలో ఎక్కడ లేనివిధంగా దేశ జనాభాలో సగభాగం యువత ఉందని యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలకు సరైన ప్రణాళిక లేదన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన మోడీ ఇప్పుడు గుడులు, గోపురాలు, మతం ఎజెండాగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగం పూర్తిగా ప్రైవేటు రంగంగా మారిపోయిందని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని నియంత్రిస్తున్న సమయంలో ఉపాధి, ఉద్యోగ హక్కుల కోసం పోరాటాలే శరణ్యమని జమ్ముల తెలిపారు. చారిత్రిక నేపథ్యం కలిగిన అఖిల భారత యువజన సమాఖ్య నేతృత్వంలో హక్కుల కోసం పోరాడుతూ సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు. పెరిగిన నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని అందుకు యువత సంసిద్ధులు కావాలన్నారు. ఈ మహాసభలో మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రవణ్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్, కొల్లి రవికుమార్, గనపారపు ఉపేందర్, మామిళ్ల కిరణ్, సిపిఐ నాయకులు మార్గం శ్రీను, సత్యనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

**ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక...**




అఖిల భారత యువజన సమాఖ్య మండల అధ్యక్షులుగా షేక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా భాను, కార్యనిర్వహక అధ్యక్షులుగా గోగుల వెంకన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబు తో పాటు 17 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా నారపోగు



**ప్రజాపక్షం/తల్లాడ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం ఛైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీపీసీసీ ఎస్సీ విభాగం ఛైర్మన్ కవంపల్లి సత్యనారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర ఇరిగేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

## సమస్యలకు నిలయంగా సంక్షేమ వసతి గృహాలు..!

**-వసతి గృహాల విద్యార్థుల గోడు రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించడం లేదా?**
**-ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని వసతి గృహాలను ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వరన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమసతి గృహాలు సమస్యల నిలియంగా కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించాలని అనేకసార్లు అధికారులకు తెలియజేసిన నిమ్మకు నిరెత్తి నట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ వసతి గృహం మరియు పిఎంహెచ్ హాస్టల్ గుట్ట పక్కన ఉండడంవల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని వారు అన్నారు. తక్షణమే ప్రహరి గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమం వసతి గృహల విద్యార్థులకు వర్షాకాలం ప్రారంభమైనందున దోమతెరలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని వంశీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం నూతన హాస్టల్ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హాస్టల్ అధ్యక్షురాలుగా భార్గవి కార్యదర్శిగా దీక్షిత వారితో పాటు 12 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు గుగులోతు అనిల్ కుమార్, బానోతు బాలాజీ, మండల నాయకులు అఖిల్ రామ్ చరణ్ లిఖితేష్, మరియు అలేఖ్య మేఘన వెన్నెల కావ్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన కారణాల రీత్యా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు దరఖాస్తులు ఇచ్చేందుకు రావద్దని ఆయన సూచించారు.

## 24 నుంచి సిపిఐ సైద్ధాంతిక రాజకీయ శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు ఈనెల 24 నుంచి నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. కారేపల్లి, కామేపల్లి మండలాల శిక్షణా తరగతులు ఈనెల 24న, వైరా, కొణిజర్ల మండలాల స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 28న, ఖమ్మం టౌన్, రఘునాథపాలెం మండల శిక్షణా తరగతులు ఈనెల 29న జరుగుతాయని సురేష్ తెలిపారు. బోనకల్, చింతకాని, మధిర శిక్షణా తరగతులు ఈనెల 30న, బోనకల్‌లో సత్తుపల్లి నియోజక వర్గ స్థాయి శిక్షణా తరగతులు ఆగస్టు ఒకటిన, ఖమ్మం రూరల్ మండలం తిరుమలాయపాలెం శిక్షణా తరగతులు ఆగస్టు రెండున, ఏన్కూరు మండల శిక్షణా తరగతులు, ఆగస్టు మూడున జరుగుతాయన్నారు. నేలకొండపల్లి , కూసుమంచి, ముదిగొండ మండల స్థాయి శిక్షణా తరగతులు నేలకొండపల్లిలో జరుగుతాయన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో వర్గ పోరాటం, సామాజిక న్యాయం, జాతీయోద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్ర, పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం, తక్షణ కర్తవ్యాలు అనే అంశాలను బోధించడం జరుగుతుందన్నారు.

## వ్యవసాయ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాశిబోయిన అయోధ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు గాలికొదిలేశాయని మండిపడ్డారు. నిరుపేదలైన వ్యవసాయ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత కల్పించి, సొంతింటి కలను నిజం చేయాలి.వ్యవసాయ కార్మికుల రక్షణ కోసం ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. వారి హక్కులను కాపాడాలి. మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, దానికి అనుగుణంగా వ్యవసాయ కూలీల దినసరి వేతనాలను కూడా వెంటనే పెంచాలి. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేకల బాబు, భూరుగుగడ్డ శ్రీను, గుంజి నాగరాజు, కందగట్ల సైదులు, మద్దెల కాళహస్తి, పామ్యేలు, తిరపతిరావు, బొడ్డ సుధాకర్, బుడిగ కృష్ణయ్య, పొటపింజర శ్రీకాంత్, గట్టిగుండ్ల దాసు తదితరులు పాల్గొని కార్మికుల పోరాటానికి మద్దతు ప్రకటించారు.

## వానలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సమృద్ధిగా వానలు కురవాలని, సకాలంలో పంటలు పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ మండల కేంద్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి ఈ వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో ఎలాంటి ప్రకృతి విపత్తులు రాకుండా, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని కోరుతూ గ్రామ దేవత అయిన బోడ్రాయికి ఘనంగా జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సాంప్రదాయ ఆటపాటలతో సందడి చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి మాట్లాడుతూ, ఆశించిన స్థాయిలో వానలు లేక కరువు పరిస్థితులు నెలకొన్న తరుణంలో, గ్రామానికి ఎలాంటి కీడు జరగకుండా అంతా మంచే జరగాలని శాంతి పూజలు నిర్వహించడం మన సంస్కృతి, ఆనవాయితీ అని పేర్కొన్నారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్న ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు చింతమళ్ల చిందు, మాదాసు సుజాత, గడ్డం చంద్రకళలతో పాటు గ్రామ మహిళలు, యువకులు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్లపై వర్షపు నీరు..పరిశీలించిన సర్పంచ్



**ప్రజాపక్షం/తల్లాడ:** మండలంలోని అన్నారుగూడెం గ్రామం ఎస్సీకాలనీలోని వర్షానికి రహదారుల వెంట భారీగా నీరు నిల్వ ఉంటున్నాయి. ఈ విషయం తెలుసుకున్న సర్పంచి, ఉపసర్పంచులు గొడ్ల ప్రభాకర్, కొమ్మినేని వెంకటేశ్వర్లు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులతో వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో డీపీఓ గ్రామాన్ని పరిశీలించి జిల్లా ఉన్నతాధికారుల నుంచి గ్రామానికి రూ.25లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, ఆపతి వెంకట రామారావు, మారెళ్ల దేవేంద్రరావు, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, గొడ్ల బాబూరావు, గోవిందు సురేశ్, కొత్తపల్లి దానయ్య, విసనపల్లి శ్రీను, లక్ష్మణ్, వార్డు సభ్యులు ముత్తయ్య, దావీదు, ఇస్నపల్లి చిన్నకృష్ణ, గొడ్ల మదార్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**







**ప్రజాపక్షం/ఇల్లందు:** ప్రజలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క తెలిపారు. ఆదివారం ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో రూ 3.25 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేవారు. అనంతరం మండలం ముత్యాలం పాడు క్రాస్ రోడ్‌లో నూతన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి ప్రజ లకు అంకితం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ అవ సరాలకు అనుగుణంగా ఉప కేంద్రాలు, లైన్ల విస్తరణ, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ సేవలు, పవర్ అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజు, ఎంఎల్ ఏలు కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, విద్యుత్ శాఖ అధి కారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమగ్ర ప్రణాళికతో కొత్తగూడెం కార్పొరేషన్ పురోగతి

**- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత**
**- అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి**
**- ఎంఎల్‌ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ :** సమగ్ర ప్రణాళితోనే కొత్తగూడెం కార్పొరేషన్ పురోగతి సాధ్యమవుతుందని ఆ దిశగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అధికారులు అంకిత భావంతో పనిచేయా లని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడె ంజిల్లా కేంద్రంలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో రాష్ట్ర రెవెనూ గృహ నిర్మాణ ప్రజాపౌరసబంధాల శాఖా మంత్రి పొంగు లేటితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసంద ర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరి ధిలోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మౌళిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యతివ్వాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్గత రహ దార్లు, మురుగు కాలువలు తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అవస రాలు తీర్చడం ద్వారానే ప్రజా శ్రేయస్సు సిద్ధిస్తుందన్నారు. మంజూరైన ప్రతీ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ధిశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజా సమ స్యల పరిష్కారమే పరమావధిగా పాలనాయంత్రాంగం నిరంతరం శ్రమించాలన్నారు. ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెరగాలని సమిష్టి కృషితోనే ఆశించిన ఫలితాలు రాబట్టగల మని స్పష్టం చేశారు. స్థానిక అవసరాలు గుర్తించి నిధుల కేటాయిం పులు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరే షన్ పరిధి పాల్వంచ పట్టణం దమ్మపేట సెంటర్ నుండి రెండున్నర కిలోమీర్ల వరకు రూ.14 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేప డుతున్నామని మంచికంటి నగర్‌లో ఎస్‌కేటి అపార్ట్మెంట్ నుండి ప్రధాన రహదారి వరకు రూ.50 లక్షలతో పక్కా రోడ్డు, కొత్తగూడెం పట్టణ పరి ధిలో పోస్టాఫీస్ సెంటర్ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి గోదుమ వాగు వరకు రూ.50 లక్షలతో డివైడర్లు అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇదిప్రజాప్రభుత్వమని, ప్రజలకు కోరికున్న మేరకు అభివృద్ధి చేసి చూపిస్తామని, ఎంఎల్‌ఏ కూనంనేని అభివృద్ధి పనులు కోరిన వెంటనే మంజూరు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా,మేయర్ మూడ్ గణేష్, డిప్యుటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి విశ్వేశ్వ రావు, గుర్రం వెంకటేశ్వర్లు, నునావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, దుర్గయ్య, బోయిన విజయ్ కుమార్, మునిగడప పద్మ, దాసరి శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, పడాల ఆకాంక్ష, మద్దాల హరిత, పి ధన లక్ష్మి , గడ్డం శాంతిప్రియ, బి కళావతి, కంచర్ల హిమశ్రీ, సహేరా బేగం, మంద నాగలక్ష్మి నాయ కులు కంచర్ల జమలయ్య, ఎండి యూసుఫ్, గడ్డం సతీష్, భవాని ప్రసాద్, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీపై గర్జించిన పౌర సమాజం

**-వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా భారీ నిరసన ర్యాలీ**
**-కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికగా నిలిచిన నిరసన**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** దేశ వ్యాప్త వివిధ పోటీ పరీక్షల పేపర్ లీకేజీలతో పాటు నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన పర్యావరణ వేత్త, సామిజిక కార్యకర్త వాంగ్‌చుక్‌కు మద్దతుగా ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రత్యామ్నాయ పౌర సమాజం (సిసిఏ) ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత అక్కడి చౌరస్తాలో ఓ సమూహంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై క్లుప్తంగా సందేశాన్ని ఇచ్చారు. వరుస పేపర్ లీకేజీలతో లక్ష లాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిం దని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలపై పోరాడుతూ ఆమ రణ నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్ చుక్‌ను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పేపర్ లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకు రావాలని నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభమైన ఈ నిర సన స్ఫూర్తిగా నిలిచి రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఇలాంటి ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ ర్యాలీ ఇక్కడి నుంచి పెద్దతండా మీదుగా నాయుడుపేట తీగల వంతెన వరకు సాగిన ర్యాలీలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ(ఎంఎల్), బిఆర్ఎస్, ఈటిపిడబ్ల్యూఎతో పాటు వివిధ కార్మిక, ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాలు, కుల సంఘాలు యూనియన్ల ప్రతినిధులతో విజయవం తంగా సాగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పేపర్ లీకేజీలపై చేపట్టిన నిరసన ప్రజల్లో ఆసక్తి కల్పించింది. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, 28, 30 వార్డుల సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్, బిఆర్ఎస్ నాయకులు మైబల్ సాబ్, మున్సిపాలిటీ సిపిఎం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు విజయ్, రమణారావు, భాస్కర్, డివైఎఫ్ నాయకులు బషీర్ పాల్గొన్నారు.

## దమ్మపేట భూ దస్త్రాల కుంభకోణం

**-జీపీవో సస్పెన్షన్**

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం భూ దస్త్రాల కుంభకోణంలో జిల్లా కలెక్టర్ తొలి చర్యగా జీపీవో వి అనంతమ్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్వే నంబర్ 385/54లోని 5 ఎకరాల భూమికి సంబంధించిన నకిలీ మరణ, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా వారసత్వం నమోదు చేసి పట్టాదార్ పాస్‌బుక్ జారీ చేసినట్లు విచారణలో తేలింది. కొత్తగూడెం ఆర్డీవో నివేదిక ఆధారంగా దమ్మపేట తహసీల్దార్ కె రామ్ నరేష్, జీపీవో అనంతమ్మ ప్రాథమికంగా బాధ్యులని గుర్తించిన కలెక్టర్, అనంతమ్మను సస్పెండ్ చేయడంతో పాటు తహసీల్దార్‌పై కూడా క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ వ్యవహారం రెవెన్యూ శాఖలో కలకలం రేపుతోంది.

## ములకలపల్లి ఆస్పత్రిని 30 పడకలకు పెంచాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని ములకలపల్లి ఆసుపత్రిని 9 పడకల నుంచి 30 పడకలకు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆసుప త్రిని సందర్శించి సమస్యలను పరిశీలించారు. అన్ని రకాల మందులు, రక్త పరీక్షలు అందుబాటులో ఉంచాలని, గర్భిణులకు మెరుగైన వైద్యం అందించా లని కోరారు. ఆసుపత్రిలో జనరేటర్, అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, పరిసరాల్లో పరిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందేలా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాలని, దోమల నివారణ చర్యలు చేపట్టి దోమ తెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నిమ్మల మధు, గోపగాని లక్ష్మి నరసయ్య, వర్సా శ్రీరాములు, గుగులోతు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కోసం రైతు ఎదురుచూపు



**ప్రజాపక్షం/ముదిగొండ:** వర్షాభావంతో ముది గొండ మండల రైతులు తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. కమలాపురం గ్రామానికి చెందిన పెద్దిబో యిన శ్రీను మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పత్తి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పంటను కాపాడేందుకు శ్రీను బావిలోని నీటిని విద్యుత్ మోటారు ద్వారా పొలానికి అందిస్తూ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. సాగుకోసం పెట్టుబడి వృథా కాకుండా ఎలాగైనా పంటను బతికించుకోవాలనే పట్టుదలతో రోజూ పొలంలోనే గడుపుతు న్నాడు. వర్షాలు కురవకపోతే పెట్టిన పెట్టుబడితోపాటు కౌలు, సాగు ఖర్చులు కూడా భారంగా మారుతాయని రైతు ఆవేధన వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం అతని ఆశలన్నీ ఆకాశం వైపే ఉన్నాయి. త్వరలో మంచి వర్షాలు కురిసి పత్తి పంటకు ప్రాణం పోయాలని ఎదురుచూస్తు న్నాడు. మండలంలోని రైతులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కుంటున్నారు.

## 104 ఏళ్ల వృద్ధురాలి ఆవేదన

**-విలేకరుల సమావేశంలో కోరిన కుటుంబ సభ్యులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన 104 ఏళ్ల వెలుతురు భద్రమ్మ తన కుటుంబ వారసత్వ భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ కన్నీటి పర్యంతమ య్యారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన భర్త వెలు తురు చిన్న వెంకయ్య 1965లో కొనుగోలు చేసిన సర్వే నెం. 319 భూమిని కొందరు అక్ర మంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తమ కుటుంబానికి చెందిన భూమిని తిరిగి అప్ప గించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా భద్రమ్మ కుటుంబ సభ్యులు 1965 నాటి కొనుగోలు పత్రాలు, సర్వే రికార్డులు, వారసత్వానికి సంబంధించిన ఆధా రాలు తదితర పత్రాలను మీడియా ఎదుట ఉంచారు. తమ వద్ద ఉన్న పత్రాలు చట్టబద్ధమైనవని అధికారులు నిష్పాక్షపాతంగా విచారణ చేపడితే నిజాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. భద్రమ్మ మనవడు వెలుతురు వీరాకుమార్ మాట్లాడుతూ తన తండ్రి అనారోగ్యంతో మృతిచెం దిన తర్వాత కుటుంబ పరిస్థితిని ఆసరా చేసుకుని కొందరు భూమిని తమ పేర్లపై మార్చుకున్నా రని ఆరోపించారు. ప్రస్తుతం దొంగ పత్రాలతో భూమిపై హక్కు చెలాయిస్తూ తాము భూమి వద్దకు వెళ్లినప్పుడల్లా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతి పత్రంగా సమర్పించామన్నారు. దీనితో మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టి నప్పటికీ ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమారు తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. భూమిపై సమగ్ర విచారణ జరిపి తిరిగి తమ భూమిని తమకు అప్పగించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## ఘనంగా హాతీరామ్ బావాజీ జయంతి

**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు మండలం మూలపోచారం పంచాయితీ రాంనగర్ తండాలోని బూడియా బాపూ దేవస్థానంలో సేవాలాల్ సేన మండల కమిటీ ఆధ్వర్యంలో, గుగులోత్ అమృత్ రాజు సాధు ఆధ్వర్యంలో హాతీరామ్ బావాజీ 597వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు భాను మనీషా లక్ష్మి , మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాదావత్ రవి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రమీల, గుగులోత్ ప్రవీణ్, సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా కో కన్వీనర్ ఇస్లావత్ చందు నాయక్, జిల్లా కన్వీనర్ భూక్య వినోద్ కుమార్, ఏన్కూరు మండల అధ్యక్షుడు బోడ ప్రవీణ్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.